సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం ı 24 ı మార్చి ı 2024



పోటెత్తిన భక్తజనం

అనకాపల్లి జిల్లా వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్శనానికి శనివారం భారీగా తరలివచ్చారు.



ఘనంగా తులసీదళార్చన

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
పాడేరు, అరకు	6.14	4.45
రంపచోడవరం	6.11	4.44

న్యూస్‌రీల్

ఉదయం మంచు.. మధ్యాహ్నం భగభగ



పాడేరులో కురుస్తున్న పొగమంచు



అడ్డుమండ రోడ్డులో ఎండ తీవ్రతకు గొడుగులను ఆశ్రయించిన పశువుల కాపరులు

సాక్షి,పాడేరు: వేసవి ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఓవైపు పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత నెలకొనగా, మరో వైపు అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. పాడేరుతో పాటు చింతపల్లి, హుకుంపేట, అరకులోయ ప్రాంతాల్లో ఉదయం వేళల్లో హెడ్‌లైట్ల వెలుగులో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి భానుడు ప్రతాపం చూపుతుండటంతో గొడుగులను ఆశ్రయిస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



వీరభద్రపురంలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయితీ వీరభద్రపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. శనివారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. పినకోట సర్పంచ్ సిరగం గణేష్ ఆధ్వర్యంలో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నందున పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎంపీటీసీ అప్పలరాజు, వార్డు మెంబర్లు కళావతి, నాగరాజు, జమ్ములు, జీనబాడు కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

నాటు తుపాకులు అప్పగింత



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు

మారేడుమిల్లి: మండలంలోని దొరచింతలపాలెం, నరసాపురం గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి నాలుగు నాటు తుపాకులను స్థానిక పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి అందిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నామని సీఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ రాము తెలిపారు. నాటు తుపాకులు ఉంటే స్వచ్ఛందంగా తీసుకువచ్చి అప్పగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

జోలాపుట్టులో చెక్‌పోస్టు ఏర్పాటు

- తనిఖీలు ముమ్మరం



జోలాపుట్టు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు,రెవెన్యూ అధికారులు..

ముంచంగిపుట్టు: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టులో చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రాకపోకలపై దృష్టి సారించిన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లు, లగేజీలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానితులు, అపరిచితుల వివరాలను సేకరించి విడిచిపెడుతున్నారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏడేళ్లలో రికార్డ్ ధర!

- గతేడాది పసుపు కిలో రూ.50 నుంచి రూ.60
- ఇప్పుడు రూ.135కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి
- 1400 నుంచి 1600 కిలోల వరకు ఎండిన పసుపు దిగుబడి
- ఎకరాకు రూ.1.89 లక్షల నుంచి రూ.2.16 లక్షల మేర ఆదాయం
- గిరి రైతుల్లో ఆనందం

ఇన్నాళ్లూ ధరలేక దిగాలు పడిన పసుపు రైతుకు మార్కెట్ పరిస్థితులు కాస్త ఊరటనిస్తున్నాయి. అంచెలంచెలుగా ధర పెరగడంతో వారికి సంతోషాన్నిస్తున్నాయి. గత ఏడేళ్లలో కిలో రూ.100కు మించి అమ్మకాలు జరిగిన సందర్భాలు లేవు. అలాంటిది ఇప్పుడు రూ.135 ధరకు వ్యాపారులు కొనుగోలు చేయడం పసుపు రైతులు రికార్డుగా చెబుతున్నారు.



వ్యాపారులు కొనుగోలు చేసిన పసుపు



పెదబయలు వారపు సంతలో పసుపు కొనుగోళ్ల సందడి

పెదబయలు: జిల్లాలో గిరి రైతులు అధిక ఆదాయం పొందే పంటలో పసుపు ఒకటి. మన్యం పసుపునకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ గత ఏడేళ్లలో కిలో రూ.100కు మించి విక్రయించిన సందర్భాలు లేవు. ఇప్పుడు వారపు సంతల్లో గిరి రైతుల నుంచి కిలో రూ.135 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది సీజన్ ప్రారంభం నుంచి కిలో రూ.50 నుంచి రూ.60 మాత్రమే ధర ఉండేది. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో రూ.75 నుంచి ప్రారంభమై గత వారం రూ.100కు చేరింది. దఫదఫాలుగా ధర పెరగడంతో ఇప్పుడు వ్యాపారులు కిలో రూ.135 ధరకు కొనుగోలు చేస్తున్నారని పసుపు రైతులు తెలిపారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ధర క్రమేపీ పెరుగుతున్నందున మరింత పెరిగే అవకాశం ఉందని వారు ఆశిస్తున్నారు.

అధిక విస్తీర్ణంలో సాగు

జిల్లాలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 17వేల హెక్టార్లలో పసుపు సాగవుతోంది. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల, పెదబయలు, పాడేరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా పండిస్తున్నారు. సేంద్రియ విధానంలో పండించడం వల్ల మంచి ధర లభిస్తోంది. పెరిగిన ధరల నేపథ్యంలో వ్యాపారులు క్వింటా రూ.13,500, టన్ను రూ.1,35,000కు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. 1400 నుంచి 1600 కిలోల వరకు ఎండిన పసుపు దిగుబడి వస్తుంది. దీంతో ఎకరాకు రూ.1.89 లక్షల నుంచి రూ.2.16లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు.

గతంలో నష్టపోయాం



పసుపు ధర గత ఏడేళ్ల నుంచి కిలో రూ.వంద మార్కు దాటడం లేదు. గత ఏడాది రూ.55 నుంచి రూ.60 మాత్రమే ధర లభించింది. సీజన్ ప్రారంభంలో కిలో ధర రూ.100 ఉంటే, ఇప్పుడు రూ.135కు పెరగడం ఆనందంగా ఉంది. గతంలో ధర లేక పెట్టుబడి కోల్పోయాం. ఇప్పుడు మంచి ఆదాయం పొందుతున్నాం.సేంద్రియ విధానంలో పండించడం వల్ల దిగుబడి నాణ్యతగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్‌పై దృష్టి సారించడం వల్లే ధర పెరిగింది.

– కొంటా సన్యాసిరావు, రైతు, కుమడ, పెదబయలు

మెలకువలు పాటిస్తే మంచి ధర



పసుపు రైతులు మంచి ధర పొందాలంటే సాగులో మెలకువలు పాటించాలి. సాధారణ పద్ధతిలో కాకుండా బెడ్ విధానంలో సాగు చేయడం వల్ల దుంప సైజు పెరగడంతో అధిక దిగుబడి వస్తుంది. నాణ్యత ఉన్నందున రవాణాకు అనుకూలంగా ఉంటుంది. టర్మరిక్ పాలిషర్ మిషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులోకి తెచ్చాయి. వీటిద్వారా గంటకు 800 కిలోలు పాలిష్ చేయవచ్చు. నాణ్యతగా ఉన్నందున మంచి ధర వస్తుంది.

– బి.శరణ్య మాధురి, ఉద్యానవనశాఖాధికారి, పెదబయలు

‘రంప’లో టీడీపీ అభ్యర్థి ఎదురీత

- వర్గాలుగా విడిపోయిన పార్టీ శ్రేణులు
- శిరీషకు వ్యతిరేకంగా సమావేశాలు
- మద్దతు ఇచ్చేది లేదని స్పష్టీకరణ

చింతూరు: రంపచోడవరంలో వర్గ పోరు కారణంగా టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష ఎదురీదుతోంది. ఈమెకు టికెట్ కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి వర్గం నిరాశకు గురవడం తెలిసిందే. దీంతో విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురంలో పార్టీ క్యాడర్ వర్గాలుగా విడిపోయింది. పార్టీ నేతలను పరిచయం చేసుకునేందుకు గ్రామాలకు వెళ్తున్న శిరీషకు స్పందన కరువైంది. వంతల అనుచరులు ఆమెకు దూరంగా ఉంటున్నారు. అసంతృప్తి వాదులంతా అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థిని మార్చే పరిస్థితి కనిపించకపోవడంతో ఆమెకు మద్దతు ఇచ్చేది లేదని వారు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు.

వంతలకు టికెట్ ఇవ్వాలని తీర్మానాలు

వంతల మద్దతుదారులు ఆయా మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వంతలకే టికెట్ ఇవ్వాలంటూ తీర్మానాలు చేస్తున్నారు. ఇటీవల చింతూరు మండల పర్యటనకు వచ్చిన శిరీషకు నిరసన సెగ తగిలింది. ఆమెకు వ్యతిరేకంగా మండలంలోని వీఆర్‌పురంలో మాజీ మండల అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు కలసి సమావేశం నిర్వహించారు. కొత్తగా వచ్చిన శిరీషకు తాము మద్దతివ్వమని స్పష్టం చేశారు. కూనవరం మండలంలో జరిగిన శిరీష పర్యటనకు ఆ పార్టీ మాజీ జెడ్పీటీసీ, మాజీ మండల అధ్యక్షుడి వర్గం డుమ్మాకొట్టింది. ఎటపాక మండలంలో సైతం తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయారు. శిరీష అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఓ వర్గం నాయకులు వంతలకే టికెట్ కేటాయించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు అరకు విద్యార్థిని నిర్మల



నిర్మలను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ చలపతి

అరకులోయ రూరల్: చిత్తూరు డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నిర్మల ప్రతిభ కనబరచింది. బంగారు పతకం సాధించిన ఈమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చలపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఆయనతోపాటు సిబ్బంది అభినందించారు. ఉత్తరప్రదేశ్ నోయిడలో ఈనెల 28న జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో నిర్మల పాల్గొంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాల సిబ్బంది రోజారాణి, కుమారి, ప్రణీత, ధర్మారావు, మౌనిక పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ



దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది



సుండ్రుపుట్టు ఎంపీపీ పాఠశాలలో చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, దంత వైద్యుడు రాజు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సాక్షి,పాడేరు: ప్రపంచ దంత వైద్య దినోత్సవాన్ని స్థానిక వైద్య కళాశాల, జిల్లా సర్వజన ఆస్పత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డి.హేమలతాదేవి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, దంత వైద్యనిపుణుడు డాక్టర్ క్రిస్టియన్ రాజు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది దంత సంరక్షణపై పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందుబాటులో ఉన్న వైద్యసేవలను వివరించారు. సుండ్రుపుట్టు ప్రాథమిక పాఠశాలలో వంద మంది విద్యార్థులకు చిన్నారులకు దంత వైద్య నిపుణుడు క్రిస్టియన్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. టూత్ బ్రస్‌లు, టూత్ పేస్ట్ తదితర సామగ్రిని పంపిణీ చేశారు.

పూరి గుడిసె దగ్ధం

కొయ్యూరు: మండల కేంద్రమైన కొయ్యూరులో షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గారా సూర్యకాంతంకు చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. రూ.లక్ష వరకు నష్టం సంభవించింది. ఆమె కాలువకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా ఎగసిపడటంతో వాటిని అదుపులోకి తెచ్చేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ బూడిద అయ్యాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని బాధితురాలు సూర్యకాంతం కన్నీరుమున్నీరైంది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.



కాలిపోయిన ఇంటి ముందు బాధితురాలు సూర్యకాంతం

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



ఎటపాక మండలం నందిగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు

ఎటపాక: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పిలుపునిచ్చారు. శనివారం కూనవరం, ఎటపాక మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో నందిగామలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు పొందిన వారంతా మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి ఆయను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి ఆశీర్వాదం పొందాలని సూచించారు. గతంకంటే అత్యధిక మెజారిటీతో తనను గెలిపించేలా కృసి చేయాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి కోరారు. సర్పంచ్ ఇంగిలపు బేబి, జెడ్పీటీసీలు ఉబ్బా సుస్మిత, గుజ్జా విజయ, ఎంపీపీలు కాక కామేశ్వరి, పాయం రంగమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు పసుపులేటి లక్ష్మణరావు, కొండలరావు, సచివాలయాల మండల కన్వీనర్లు, ఆవుల మరియదాసు, గోసు ప్రశాంత్, పార్టీ మండల కన్వీనర్లు తానికొండ వాసు,ఆలూరి కోటయ్య, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు డీకొండ గంగాధర్, అరవ వెంకట రామారావు పాల్గొన్నారు.



అరకులో మేము సిద్ధం అంటూ ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న పార్టీ నేతలు

జగనన్నతోనే పేదల సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- మద్దతు కోరిన పార్టీ ఎంపీ,అసెంబ్లీ అభ్యర్థులు తనూజరాణి, మత్స్య



అరకులో చిరు వ్యాపారిని ఓటు అడుగుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తనూజరాణి, మత్స్యలింగం

అరకులోయ రూరల్: జగనన్నతోనే పేదల సంక్షేమం సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన అరకులోయ పట్టణంలో శనివారం అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మా తనూజ రాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం ‘మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం’ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా అన్ని వర్గాల ప్రజలతోపాటు చిరువ్యాపారులను కలిసి మద్దతు కోరారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఎంపీ, అసెంబ్లీ స్థానాల రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. సీనియర్ ఓటర్లకు అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఆయనతోనే నిజమైన గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను చేరువ చేశారన్నారు. అరకు పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, సర్పంచ్‌లు భాస్కర్, బొజ్జ, ఎంపీటీసీ సభ్యులు శత్రుఘ్న, రాంచందర్ పాల్గొన్నారు.

విజయం సాధిద్దాం

అందరూ కలిసికట్టుగా పనిచేసి అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల ముఖ్యనాయకులు, ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏమీ లేవన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపీపీ ఉషారాణి, మహిళ విభాగం జిల్లా అధికార ప్రతినిధి రాధిక, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పాడి రమేష్, సర్పంచ్‌లు భాస్కర్, బుటికి, వెంకటరావు, ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, మోస్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్

మారేడుమిల్లి: టేకు చెట్లు మాయం చేసిన ఘటనలో మారేడుమిల్లికి చెందిన ఇరువురు అటవీశాఖ అధికారులను ఆశాఖ ఉన్నతాధికారులు శనివారం సస్పెండ్ చేశారు. మండలంలోని నూడిపూడి బీట్‌లో ఇటీవల కొన్ని టేకు చెట్లు నరికి తరలించారు. ఇది గమనించిన గ్రామస్తులు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. టేకు చెట్లు మాయం అయినట్లు గమనించిన అధికారులు డీఆర్వో జాన్‌బాబు, గార్డు వసంతకుమారిలను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు. దీనిపై రేంజ్ అధికారి ఆజాద్‌ను వివరణ కోరగా వాస్తవమేనన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు : ఈఏడాది ఏప్రిల్ 27న నిర్వహించనున్న పాలిసెట్–2024కు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీలోగా టెన్త్ పాసైన, ప్రస్తుతం పరీక్ష రాస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెల్ప్ లైన్ సెంటర్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. టెన్త్ సిలబస్ ఆధారంగానే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ ప్రారంభిస్తామని, మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్–60, మెకానికల్–60, ఎలక్ట్రికల్ ట్రేడ్‌ల్లో 60 సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన లేక చాలామంది సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామస్థాయిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్టు కనిపిస్తే తక్షణం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలోని టీబీ పరీక్ష కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయవ్యాధిని నుంచి సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడవచ్చన్నారు. ప్రతీ గ్రామంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలపై సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రకాశం, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె.లక్ష్మి , డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఇందిర, వైద్యాధికారులు రాధిక, అపూర్వ, వినోద్, సుజిత, సాహిన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపండు కిలో రూ.40

సీజన్ ప్రారంభంతో భారీగా అమ్మకాలు



పాడేరు పాత బస్టాండ్ వద్ద మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చింతపండు

సాక్షి,పాడేరు: చింతపండు సీజన్ ప్రారంభమైంది. పాడేరు, గుత్తులపుట్టు, జి.మాడుగుల, పెదబయలు, అన్నవరం, తాజంగి, చింతపల్లి, హుకుంపేట, వంట్లమామిడి, కించుమండ, అరకు, కాశీపట్నం వారపుసంతల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రమైన పాడేరు పాతబస్టాండ్‌లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 9గంటల వరకు గిరిజనులు బుట్టలతో చింతపండును తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. చింతపండు నాణ్యతను బట్టి 10 కిలోలు రూ.400 నుంచి 500 ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తూకం లెక్కన వ్యాపారులు కిలో రూ.40తో కొంటున్నారు. వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో ధర బాగుండటంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది. జీసీసీ కూడా చింతపండు కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తుందని జీసీసీ డీఎం డి.సింహాచలం తెలిపారు. గత ఏడాది కిలో రూ.32.40 చొప్పున కొనుగోలు చేయగా, ఈ ఏడాదికి సంబంధించిన కొనుగోలు ధర జీసీసీ యాజమాన్యం ప్రకటించాల్సి ఉందని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలి

హుకుంపేట: క్షయ వ్యాధి నిర్మూలనపై అందరికీ అవగాహన కల్పించాలని డీఎండీహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలున్న వారు స్థానిక వైద్యాధికారులకు, ఆశా కార్యకర్తలకు సమాచారం అందించాలని కోరారు. అంతకు ముందు ఆశా కార్యకర్తలకు బహుమతులు,ఆరుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి సౌమ్య, ఎంపీహెచ్‌వో కోడా మహేష్, సూపర్‌వైజర్లు సాంబశివరాజు, సదాశివరాజు పాల్గొన్నారు.

చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖపట్నం) : హోలీ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి-చెన్నై ఎగ్మోర్ మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి(06077) అన్ రిజర్వ్ డ్ స్పెషల్ ఈ నెల 23, 30, ఏప్రిల్6వ తేదీల్లో (ప్రతి శనివారాలలో) చెన్నై ఎగ్మోర్‌లో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.54 గంటకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి మధ్యాహ్నం 1.59 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలోసంత్రగచ్చి-చెన్నై ఎగ్మోర్ (06078) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 25, ఏప్రిల్ 1, 8వ తేదీల్లో సంత్రగచ్చిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.

ఇద్దరిని కాటేసిన రోడ్డు ప్రమాదం


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు


గాయపడిన అప్పారావు


కాశీపురంలో రోదిస్తున్న పూడి గంగునాయుడు కుటుంబ సభ్యులు


- శంకరం వద్ద ఇద్దరి దుర్మరణం
- కూలి పనికి వెళ్లి తిరిగి రాని లోకాలకు..
- కాశీపురంలో పెళ్లింట విషాదం

అనకాపల్లి/దేవరాపల్లి : పెందుర్తి నుంచి యలమంచిలి వెళ్తున్న బొలెరో వ్యాన్ అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిలో అదుపు తప్పి డివైడర్, విద్యుత్‌పోల్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం మేరకు దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన పూడి గంగునాయుడు (66), ఆదిరెడ్డి గంగునాయుడు (74), అప్పారావు కూలిపనుల నిమిత్తం ప్రతిరోజు దేవరాపల్లి నుంచి పెందుర్తి వెళ్తుంటారు.

అక్కడ టైల్స్ తీసుకుని యలమంచిలి వెళ్తారు. శనివారం కూడా బొలెరో వ్యాన్‌లో కాశీపురానికి చెందిన మేస్త్రీ గోపి, వ్యాన్ డ్రైవర్ జి.అప్పారావుతో పాటు యలమంచిలి బయలుదేరారు. అయితే వారి వాహనం అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిలో అధిక వేగంతో వెళ్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు, అప్పారావుపై ఫ్లోరింగ్ పలకలు పడి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పారావు కుడి చెయ్యి విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మేస్త్రీ గోపి, వ్యాన్ డ్రైవర్ జి.అప్పారావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆదిరెడ్డి గంగునాయుడు అల్లుడు పెంటా అర్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు చెప్పారు.

పెళ్లింట విషాదం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పూడి గంగునాయుడు ఏకైక కుమారుడు జోగినాయుడుకి ఏప్రిల్ 13న వివాహం జరిపించేందుకు నిశ్చయించారు. పెళ్లి పనులు సైతం ప్రారంభించారు. ఏప్రిల్ 5న ప్రధానం జరగాల్సిన తరుణంలో కుటుంబ పెద్ద గంగునాయుడు మృతితో ఈ కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు బాజాలు మోగడంతో ఆ కుటుంబ పరిస్థితిని చూసిన వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. కొడుకు పెళ్లి చూడకుండానే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ గంగునాయుడు భార్య సత్యవతి గుండెలవిసేలా రోదించిన తీరు పలువురి హృదయాలను కలచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన ఆదిరెడ్డి గంగునాయుడికి భార్య ఈశ్వరమ్మ, కుమార్తె కన్నతల్లి, కుమారుడు సత్తిబాబు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఈ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. కూలి పనికి వెళ్లి తిరిగిరాని లోకాలకు తరలిపోయావా, ఇక మాకు దిక్కెవరు అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


మృతులు పూడి గంగునాయుడు (ఫైల్)


ఆదిరెడ్డి గంగునాయుడు (ఫైల్)

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు/వీఆర్‌పురం: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ అన్నారు. వీఆర్‌పురం మండలం నూనెవారిగూడెంలో శనివారం నిర్వహించిన చింతూరు, వీఆర్‌పురం మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గడచిన ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేసినట్టు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తొలి ప్రాధాన్యతగా జగనన్న పాలన కొనసాగిందన్నారు. గతంలో పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలు, వార్డు వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల చెంతకే పాలన చేరిందని వారు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 కోట్ల కంటే అధికంగా, ప్రతి మండలానికి రూ.150 కోట్లకు పైబడి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. గత ప్రభుత్వాల పనితీరు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుకు మధ్య తేడాను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు అధిక మెజార్టీ వచ్చేలా పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో ఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, సొసైటీ చైర్మన్ విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, మడివి రాజు, ఎండీ జిక్రియా, మడివి ప్రవీణ్, పాపారావు, శ్రీనివాసరావు, శివన్నారాయణ, వీఆర్‌పురం మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, పొడియం గోపాల్, బొడ్డు సత్యనారాయణ, మాచర్ల గంగులు, చిక్కాల బాలు, వైస్ ఎంపీపీ ముత్యాల భవానీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయాలి


పాడిలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

వైఎస్సార్ సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు

కొయ్యూరు: హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి కూడా సీఎంను చేయాలని వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. కొండగోకిరి పంచాయతీలో గుజ్జుమానుపాకలు, పాత పాడి, కొత్తపాడి, రత్నంపేట గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందరికీ సంక్షేమ పథకాలను అందజేశారని, గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, జి.మాడుగుల మండల అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జి పొట్టిక పోతురాజు, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు బాబ్జీ, ఎంపీటీసీలు బి.అప్పారావు, మల్లేశ్వరి, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రీమెల గంగాధర్, సర్పంచ్‌లు రాజ కుమారి, కోడా రాంబాబు, పాటి నూకరత్నం, పొట్టిక శ్రీను, రావుల వెంకటలక్ష్మి, సగ్గే సూరిబాబు, రీముల శ్రీను,సుర్ల చంద్రరావు,సీనియర్ నేతలు రావడ శేఖర్,వనంబాబు పాల్గొన్నారు

పోక్సో చట్టం.. చిన్నారులకు రక్షణ కవచం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్


సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్


హాజరైన వివిధ శాఖల అధికారులు

విశాఖ లీగల్: బాలికలకు ఎటువంటి హాని జరగకుండా.. వారిని రక్షించే బాధ్యత అందరిదీ అని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో పోక్సో చట్టం-2012, మోటారు వాహన ప్రమాద చట్టం , తదితర అంశాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, యువతులు, కౌమార దశ బాలికలను తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా తగిన రక్షణ కల్పించాలన్నారు. పోక్సో చట్టం సెక్షన్ 7, 8, 12 గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఏ ఒక్క బాలికకు అన్యాయం జరిగినా.. అది వారి జీవితాలతోపాటు సమాజంపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఇటీవల వయసుతో పని లేకుండా మానవ మృగాలు చేస్తున్న అకృత్యాలపై న్యాయ స్థానాల సైతం తీవ్రంగా స్పందిస్తున్నట్లు చెప్పారు. పోక్సో చట్టం చిన్నారులకు ఒక రక్షణ కవచంగా అభివర్ణించారు. ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా రాణించాలన్నారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. బాలల భద్రత-న్యాయ సేవా సంస్థ అందిస్తున్న సేవలపై రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ ప్రసంగించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైల శ్రీనివాసరావు పలు అంశాలపై మాట్లాడారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.